సాక్షి చిత్తూరు

మంగళవారం । 18 । మార్చి । 2025



భవిత భారం..'శిక్షణ' దూరం

చిత్తూరులో డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని పలువురు డీఎస్సీ అభ్యర్థులు డిమాండ్ చేశారు. - 8లో



విద్యార్థుల ఆకలి కేకలు

పదోతగరి పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసిన సర్కారు బడుల్లో పిల్లలకు మధ్యాహ్న భోజనం సక్రమంగా అందడం లేదు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం (సా)	సహర్ బుధవారం (ఉ)
చిత్తూరు	6-29	4-59
పుంగనూరు	6-30	5-04

న్యూస్‌రీల్

వెదురు పెంపకంపై వర్క్‌షాప్



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

చిత్తూరు కలెక్టరేట్ : డీఆర్‌డీఏ కార్యాలయంలో సోమవారం చిత్తూరు, ప్రకాశం, తిరుపతి, అన్నమయ్య, నంద్యాల జిల్లాల ఏంపీఏలు, సీసీలతో వెదురు పెంపకంపై ఒక్క రోజు వర్క్‌షాపు నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి మాట్లాడుతూ వెదురు పెంపకంతో అనేక లాభాలున్నాయన్నారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాల ప్రకారం వెదురుకు మంచి డిమాండ్ ఉందని తెలిపారు. అతి తక్కువ ఖర్చుతో ఎలాంటి భూముల్లోనైనా వెదురు సాగు చేయవచ్చన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందవచ్చని వెల్లడించారు.సంఘాల్లోని మహిళా రైతులకు వెదురుపెంపకంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రస్తుతం కనుమరుగవుతున్న వెదురును ప్రోత్సహించాలని సూచించారు. పోడు భూముల సైతం ఈ పంట సాగుచేయవచ్చని, తద్వారా ఏటా రూ.లక్ష వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉన్నట్లు వివరించారు. ఇందుకు ఇండస్ట్రీ ఫౌండేషన్ తరఫున పూర్తి సాంకేతిక పరిజ్ఞానం అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సెర్ప్ జేఈ వెంకటరావు, ఇండస్ట్రీ ఫౌండేషన్ శాస్త్రవేత్తలు అశోక్, కుసుమ, అమృత, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పలువురు తహసీల్దార్ల నియమాకం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పలు మండలాలకు తహసీల్దార్లను నియమించారు. సోమవారం ఈ మేరకు ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి ఉత్తర్వులు జారీచేశారు. ఈ క్రమంలో ముగ్గురు తహసీల్దార్లను డిప్యూటేషన్ పద్ధతిలో, నలుగురు డీటీలకు తహసీల్దార్లుగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అందులో భాగంగా రామకుప్పం తహసీల్దార్ బాబును వెదురుకుప్పానికి, విజయపురం తహసీల్దార్ మాధవరాజును గంగవరానికి, పూతలపట్టు తహసీల్దార్ గురప్పను కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. శాంతిపురం డీటీ కాలేష్‌కు రామకుప్పం తహసీల్దార్‌గా, వెదురుకుప్పం డీటీ రమేష్‌బాబుకు పూతలపట్టు, జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయం డీటీ శ్యాంప్రసాద్ రెడ్డికి బైరెడ్డిపల్లె, కుప్పం ఆర్డీఓ కార్యాలయ డీటీ ప్రసన్నకుమార్‌కు శాంతిపురం తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 57 ఫిర్యాదులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ

చిత్తూరు అర్బన్: జిల్లా ఆర్మ్డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారం వేదికకు 57 ఫిర్యాదులు అందాయి. ఏఎస్పీ రాజశేఖర్‌రాజు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీలను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

● పశువుల దాహార్తిని తీర్చే గొల్లయాదవ కుంటకు వెళ్లే దారి సమస్యపరిష్కరించాలని ఐరాల మండలం పుల్లూరు గ్రామస్తులు విన్నవించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరికి అర్జీ అందించారు. గొల్లయాదవ కుంటకు సమీపంలోని డీకేటీ భూమిని కొనుగోలు చేసిన ఓ వ్యక్తి ఇప్పుడు తమకు దారి లేకుండా చేసి ఇబ్బందులు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై పలుమార్లు తహసీల్దార్‌కు వినతులు సమర్పించిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



● వెదురుకుప్పం మండలం మారేపల్లె దళితవాడకు చెందిన రైతు సింగారయ్య సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో తన సమస్యను మొరపెట్టుకున్నాడు. తనకున్న కొద్దిపాటి భూమిలో వరి నాటుకుంటే, అగ్రకులానికి చెందిన ఓ వ్యక్తి స్వార్థంతో తమకు వచ్చే నీటి కాలువను దౌర్జన్యంగా పూడ్చివేసి ఇబ్బందిపెడుతున్నాడని పేర్కొన్నాడు. దీంతో నీరు అందక పంట ఎండిపోతోందని, ఈ విషయంపై తహసీల్దార్‌కు పలుమార్లు విన్నవించుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయాడు.



వినతి.. లేదు అతీగతి!

పొలం బాట కబ్జా చేశారు.. న్యాయం చేయండి. బతకడమ కష్టంగా ఉంది.. పింఛన్ ఇప్పించండి. దాహార్తితో అలమటిస్తున్నాం.. నీరు అందించండి. పంట కాలువను పూడ్చేశారు.. చర్యలు తీసుకోండి. శ్మశానం అధ్వాన్నంగా ఉంది.. కనీస సౌకర్యాలు కల్పించండి. కని పెంచిన బిడ్డలు తరిమేశారు.. ఆదుకోండి. ఇలా ప్రజలకు ఏ సమస్య వచ్చినా అధికారుల వైపే చూస్తుంటారు. ఒక్క అర్జీ ఇస్తే తమ కష్టం తీరిపోతుందని నమ్ముతుంటారు. అయితే క్షేత్రస్థాయిలో జనం ఆశలు నెరవేరడం లేదు. మండలస్థాయిలో పట్టించుకోవడం లేదు. కలెక్టరేట్‌కు వెళ్లినా ఫలితం కనిపించడం లేదు. ఈ క్రమంలోనే ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక ప్రహసనంగా మారిపోయింది. బాధితులు అందించే వినతులకు అతీగతీ లేకుండా పోతోంది.

- తూతూమంత్రంగా ప్రజాసమస్యల పరిష్కార వేదిక
- వివిధ సమస్యలపై వెల్లువెత్తుతున్న అర్జీలు
- క్షేత్రస్థాయిలో పట్టించుకోని అధికారులు
- మాయమాటలతో ఎండార్స్‌మెంట్‌పై సంతకాలు
- చిత్తశుద్ధి లేని ప్రభుత్వ వైఖరిపై మండిపడుతున్న జిల్లా వాసులు
- సాక్షి విజిట్‌లో వెల్లడైన వాస్తవాలు



వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి



కలెక్టరేట్‌లో అర్జీదారులు

గ్రౌండ్ రిపోర్ట్

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం 45,810 అర్జీలు వచ్చాయి. ఇందులో 32,900 పరిష్కరించినట్లు అధికారిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. అయితే ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మాత్రం వినతులు పెరుగుతూనే ఉన్నాయి. క్షేత్రస్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు తూతూమంత్రంగా ప్రజల అర్జీలకు సమాధానం ఇస్తున్నారని తెలిసింది. ఈ విషయాన్ని సోమవారం కలెక్టరేట్‌కు విచ్చేసిన పలువురు అర్జీదారులే వెల్లడించారు. మండల స్థాయి అధికారులు ఏ మాత్రం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో దూరాభారం అయినా ప్రతి సోమవారం చిత్తూరుకు వస్తున్నట్లు వాపోతున్నారు.

ఒక్కొక్కరిది..ఒక్కో ఆవేదన

జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు ప్రాంతాల నుంచి ప్రజలు వందల సంఖ్యలో విచ్చేస్తున్నారు. ప్రతి వారం వచ్చిన వారే మళ్లీ వస్తున్నారు. సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రీవెన్స్‌లో సమస్యలు వెల్లడిస్తున్న వారిలో ఒక్కొక్కరిది...ఒక్కొక్క ఆవేదన. అధికారులు కరుణించపోవడంతో చేసేదేమి లేక ప్రజలు వినతులను పలుమార్లు ఇస్తూనే ఉన్నారు.

ఏమార్చి సంతకం చేయించుకుని..

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చేచ ప్రతి అర్జీని అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. వీటిని పరిష్కరించేందుకు ఒక్కొక్క సమస్యను బట్టి నిర్ణీత గడువు ఉంటుంది. ఆ లోపు సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు వెళ్లి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాల్సి ఉంటుంది. అయితే అధికారులు అలా చేయకుండా అర్జీదారులను ఏమారుస్తున్నారు. పరిష్కార తేదీ సమీపంలో వారిని కార్యాలయాల వద్దకు పిలిపించి మాయమాటలు చెప్పి సంతకాలు చేయించుకుంటున్నారు. తర్వాత అర్జీ పరిష్కరించినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. కూటమి టీడీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఈతతంగమే సాగుతోంది.

ఏదీ పరిష్కారం

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గత పది నెలల్లో ఇప్పటి వరకు 32,824 పరిష్కరించామని కలెక్టరేట్ అధికారులు గొప్పలు చెప్పుకుంటున్నారు. మిగిలిన 12,880 అర్జీలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లువ వెల్లడిస్తున్నారు. అయితే ఇవన్నీ తప్పుడు లెక్కలే అని క్షేత్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి.

గత పది నెలలుగా కలెక్టరేట్‌కు వచ్చిన అర్జీల వివరాలు

రెవెన్యూ:	22,470
సర్వే శాఖ:	15,977
పోలీస్:	2,118
హౌసింగ్:	756
మున్సిపల్:	558
సివిల్ సప్లయిస్:	524
పీఆర్ ఇంజినీరింగ్:	441
పంచాయతీరాజ్:	399
సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ:	372
ఎస్పీడీసీఎల్:	334
పశుసంవర్థకశాఖ:	296
ఆర్‌డబ్ల్యూఎస్:	231
దేవదాయశాఖ:	171
గ్రామీణాభివృద్ధి:	126
పబ్లిక్ హెల్త్:	125
వాటర్ రీసోర్స్:	122
సోషల్ వెల్ఫేర్:	113
ఇతర శాఖలు:	677
మొత్తం:	45,810

భూమిని ఆక్రమించుకుంటున్నారయ్యా!



మాది యాదమరి మండలం కృష్ణపల్లె. మా గ్రామంలో నివాసముండేందుకు గాను కాస్త భూమి నా పేరుతో ఉంది. నేను వృద్ధాప్యంలో ఉండడంతో ఆ భూమిని మరొకరు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అడిగినందుకు బెదిరిస్తున్నారు. మా మండల తహసీల్దార్ కు సమస్య చెప్పినప్పటికీ న్యాయం చేయలేదు. కలెక్టర్‌కు సమస్య చెప్పుకుంటే న్యాయం జరుగుతుందని ఇంత దూరం వచ్చా.

– కస్తూరి, వృద్ధురాలు, యాదమరి మండలం.

శ్మశాన స్థలంలో బోరు వేస్తున్నారు



మాది కార్వేటి నగరం మండలం కేశవకుప్పం ఎస్టీ కాలనీ. సర్వే నంబర్ 18లో శ్మశానవాటికకు ఎకరా భూమిని ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ శ్మశానాన్ని ఎస్టీ కాలనీ వాసులు ఉపయోగించుకుంటున్నారు. అయితే ఇటీవల ఓ వ్యక్తి అక్రమంగా ఈ స్థలంలో బోరు వేసుకుంటున్నాడు. దీంతో అధికారులను ఆశ్రయించాం. శ్మశానానికి హద్దులు గుర్తించి ప్రహరీగోడ, సీసీ రోడ్డు వేయించాలని కోరాం. న్యాయం జరుగుతుందో లేదో చూడాలి.

– వెంకటరామయ్య, జయరామయ్య, కేశవకుప్పం గ్రామస్తులు

సౌకర్యాలు కల్పించాలి



మాది కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలం పీఎంకే తాండా. మా కాలనీలో 1,200 మంది నివాసముంటున్నాం. మా కాలనీకి సమీపంలో ఉన్న శ్మశానంలో మౌలిక వసతులు లేవు. ఎవరైనా మృతి చెందితే శ్మశానానికి వెళ్లాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ మేరకు మౌలిక వసతులు కల్పించాలని చాలా సార్లు వినతులిచ్చాం. ఎవరూ పట్టించుకోవడం లేదు.

– ధనపాల్ నాయక్, మూర్తి నాయక్, పీఎంకే తాండా వాసులు

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం



విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీస్

● తొలిరోజు 856 మంది గైర్హాజరు



గిరింపేటలో ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సోమవారం పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 118 కేంద్రాల్లో తొలిరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు తెలుగు పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను లోపలికి తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీలు చేసి కేంద్రాల్లోకి అనుమతించారు. మొదటి పరీక్షకు మొత్తం 20,746 మంది విద్యార్థులకు గాను 19,890 మంది హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. 856 మంది గైర్హాజరైనట్లు వివరించారు. ఈ క్రమంలోనే పలు పరీక్ష కేంద్రాలను ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి, డీఈఓ తనిఖీ చేశారు.

అమలు కాని నిబంధనలు

నిబంధనల ప్రకారం పరీక్ష కేంద్రానికి 100 మీటర్ల దూరంలో ఉన్న జిరాక్స్,నెట్ సెంటర్లను పరీక్ష పూర్తయ్యే వరకు మూసివేయాల్సి ఉంటుంది. అయితే చిత్తూరులోని గిరింపేట నగరపాలక ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రానికి సమీపంలో జిరాక్స్ సెంటర్‌తెరిచే ఉంచారు. ఇదే విధంగా జిల్లాలోని పలమనేరు, కుప్పం, నగరి, పూతలపట్టు, పుంగనూరులోట పలు జిరాక్సు సెంటర్లు మూత పడలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



గిరింపేటలో పరీక్ష కేంద్రానికి సమీపంలో మూతపడని జిరాక్స్ సెంటర్

పలువురు పోలీసుల బదిలీ

చిత్తూరు అర్బన్: జిల్లా పోలీసు శాఖలో పలువురికి స్థాన చలనం కల్పిస్తూ ఎస్పీ మణికంఠ చందోలు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు 45 మందిని బదిలీ చేస్తున్నటు పేర్కొన్నారు. ఇందులో ఏఎస్ఐలు 26 మంది, హెడ్ కానిస్టేబుల్‌లు 19 మంది ఉన్నారు. అయితే పుంగనూరులో జరిగిన హత్య ఉదంతాన్ని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రస్తావిస్తూ ఎస్పీపై విమర్శలు ఎక్కు పెట్టడం తాము చెప్పిన వాళ్లను బదిలీ చేయలేదంటూ బహిరంగంగానే ఒత్తిడి పెంచడం తెలిసిందే. ఈ నేపథ్యంలో వెలువడ్డ బదిలీల్లో ఒక్క పుంగనూరు నియోజకవర్గం నుంచే 20 మందిపై బదిలీ వేటు పడడం గమనార్హం.

పకడ్బందీగా ఇంటర్ మూల్యాంకనం

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్మీడియట్ మూల్యాంకనం ప్రారంభమైంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తొలిరోజు మూల్యాంకనం చేపట్టారు. మొత్తం ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఇంటర్మీడియట్ డీవీఈవో సయ్యద్‌మౌలా వెల్లడించారు.

రక్తంతో రాజకీయమా?

పుంగనూరు నియోజకవర్గంలో ప్రశాంతతను దెబ్బతీసేందుకు టీడీపీ నేతలు యత్నిస్తున్నారు. రక్తంతో రాజకీయాలు నడిపేందుకు కుతంత్రాలు పన్నుతున్నారు. వైఎస్సార్‌సీపీని బద్నామ్ చేయడమే లక్ష్యంగా కుట్రలకు తెగబడుతున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు ఇష్టారాజ్యంగా ఆరోపణలు గుప్పిస్తున్నారు. అలజడి సృష్టించే దిశగా రెచ్చగొట్టే వ్యాఖ్యలకు పాల్పడుతున్నారు. ఇటీవల కృష్ణాపురంలో జరిగిన హత్యను స్వార్థ ప్రయోజనాలకు వాడుకునేందుకు సిద్ధమవుతున్నారు.

- రామకృష్ణ హత్యను వైఎస్సార్‌సీపీపై నెట్టేందుకు యత్నం
- వ్యక్తిగత కక్షలే కారణమన్నది ముమ్మాటికీ నిజం
- శాంతిభద్రతల రక్షణలో విఫలమైన ప్రభుత్వం



పుంగనూరులో విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

పుంగనూరు : మండలంలోని కృష్ణాపురంలో ఈనెల 15వ తేదీన జరిగిన రామకృష్ణ అనే వ్యక్తి హత్యను పావుగా వాడుకునేందుకు టీడీపీ నేతలు సిద్ధమైంది. తమ పార్టీ కార్యకర్త హత్య జరిగే వరకు కళ్లప్పగించి చూసిన పచ్చ నేతలు.. ఇప్పుడు మాత్రం నెపం వైఎస్సార్ సీపీపైకి నెట్టేందుకు శతవిధాలా ప్రయత్నం చేస్తున్నారు. హత్యకు ముందు మృతుడు విడుదల చేసిన వీడియో తర్వాత కూడా స్పందించకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. మృతుడు కాపాడమని ప్రభుత్వాన్ని వేడుకున్నప్పటికీ నిర్లక్ష్యం వహించడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. తీరా హత్య జరిగిన తర్వాత శవ రాజకీయాలు చేస్తున్నారని పుంగనూరు వాసులు మండిపడుతున్నారు. అందులో భాగంగానే పుంగనూరు సీఐ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ సుబ్రమణ్యంపై వేటు వేసినట్లు తెలిసింది.

తడాఖా చూపిస్తామంటూ..!

హతుడు రామకృష్ణ కుటుంబీకులను పరామర్శించి, అంత్యక్రియల్లో పాల్గొన్న టీడీపీ పుంగనూరు ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి చేసిన వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రెండునిమిషాలు టైమ్ ఇస్తే మా తడాఖా ఏంటో చూపిస్తాం...వైఎస్సార్‌సీపీకి గుణపాఠం నేర్పుతాం...పెద్దిరెడ్డి హత్యా రాజకీయాలను అడ్డుకుంటాం అంటూ చెలరేగిపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పుంగనూరు ప్రశాంతతను దెబ్బతీసేందుకే ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

వ్యక్తిగత కక్షలతోనే..

రామకృష్ణ, వెంకట్రమణ బంధువులు. వీరి మధ్య వ్యక్తిగత కక్షలు ఉన్నాయి. పలుమార్లు ఘర్షణ పడడం, దాడులు చేసుకుని పోలీసులను ఆశ్రయించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఈ క్రమంలోనే జరిగిన హత్యను పార్టీలకు అంటగట్టడం సరికాదని స్థానికులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. స్వార్థ ప్రయోజనాల కోసమే ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించడం గమనార్హం.

ఇరికించే ప్రయత్నం

రామకృష్ణ హత్యకు ప్రభుత్వమే రాజకీయ రంగు పులిమింది. వ్యక్తిగత కక్షలతో జరిగిన ఘటనకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వర్గీయుడు అంటూ విషం కక్కింది. ఈ క్రమంలోనే హత్యకు సంబంధం లేని వ్యక్తులను కూడా ఈ కేసులో ఇరికించే ప్రయత్నం జరుగుతోంది. సోమవారం ఈ మేరకు ఎస్పీ మణికంఠ చందవోలు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాటలే నిదర్శనం. నిందితులు వైఎస్సార్‌సీపీకి చెందిన నేతలకు అనుచరులు అంటూ ఎస్పీ వెల్లడించారు. వాస్తవానికి ఈ కేసులో ప్రత్యక్షంగా పాల్గొన్నది వెంకట్రమణ ఒక్కడే, అయితే వైఎస్సార్‌సీపీ నేతలను వేధించేందుకు కేసును మరో వైపునకు తిప్పారు. ఇప్పుడు కేసులో ఐదుగురు నిందితులు ఉన్నారని, వీరు వైఎస్సార్‌సీపీ నేతలని చెప్పడం వెనుక కుట్రకోణం ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పోలీసుల వైఫల్యమే

రామకృష్ణ హత్య పోలీసుల వైఫల్యమేనని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం ఎస్పీ దృష్టికి తీసుకెళ్లిన స్పందించలేదని, దీంతో ఆయనతో మాట్లాడటమే మానేశానని అధికార పార్టీ ఎమ్మెల్యే చెప్పడం ప్రభుత్వ వైఫల్యంకాదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ వైఫల్యాన్ని వైఎస్సార్‌సీపీపైకి నెట్టి మళ్లీ రాజకీయం చేస్తారా అని పుంగనూరు ప్రజలు నిలదీస్తున్నారు.

ఆరోపణలు బాధాకరం : రెడ్డెప్ప



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఏనాడూ హత్యా రాజకీయాలు చేయలేదని మాజీ ఎంపీ రెడ్డెప్ప స్పష్టం చేశారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ టీడీపీ కార్యకర్త రామకృష్ణ హత్యతో పెద్దిరెడ్డి కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. వ్యక్తిగత కక్షతో హత్య జరిగితే వైఎస్సార్‌సీపీ నేతలు, పెద్దిరెడ్డి కుటుంబంపై ఎస్పీ ఆరోపణలు చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పథకం ప్రకారం పెద్దిరెడ్డి కుటుంబ ప్రతిష్టను దెబ్బతీసేందుకు యత్నిస్తోందని విమర్శించారు.

అంతా మా ఇష్టం!

● కుప్పంలో మహిళలకు చుక్కెదురు

కుప్పం : పట్టణంలో టీడీపీ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి చిరుద్యోగుల పొట్టకొడుతున్నారు. ఈ క్రమంలోనే స్థానిక మోడల్ కాలనీ ఆర్పీ(సంఘమిత్ర) రేష్మాను తొలగించాలని అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. పొదుపు సంఘాల మహిళలు వ్యతిరేకించినా పట్టించుకోలేదు. ఆందోళనకు దిగినా ఖాతరు చేయలేదు. అధికారులు సైతం పచ్చనేతలకు వంతపాడారు. రేష్మాను వైఎస్సార్‌సీపీ సానుభూతిపరురాలిగా ప్రకటించి విధుల నుంచి తొలగించేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు జారీ చేసిన హెచ్చరికలు సోషల్‌మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. తాము నియమించిన వారితోనే డ్వాక్రా పనులు జరుగుతాయని, అడ్డుకోవాలని యత్నిస్తే సహించే ప్రసక్తే లేదని మహిళలను బెదిరించిన వైనం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

క్లుప్తంగా

శాస్త్రోక్తం..'చతుర్థి'వ్రతం



స్వర్ణరథంపై ఊరేగుతున్న స్వామివారు

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో సోమవారం శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధి, బుద్ధి సమేత గణపతి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ ఆస్థాన మండపంలో కొలువుదీర్చారు. ఉదయం 10 నుంచి 11 గంటలు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు వ్రతం జరిపించారు. పెద్దసంఖ్యలో భక్తులు వ్రతం ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలోనే రాత్రి వినాయక స్వామివారు స్వర్ణరథం అధిరోహించి మాడవీధుల్లో విహరించారు. భక్తులు కర్పూరహారతులు సమర్పించారు. కార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్ పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో టోకరా

పలమనేరు : తమ కుమారుడికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ పలమనేరుకు చెందిన ఎంఎస్ రంజిత్ అనే వ్యక్తి రూ.25లక్షలకు టోకరా వేశాడని స్థానిక సాయినగర్‌కు చెందిన విశ్వనాథ్, ప్రభావతి దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఈ మేరు చిత్తూరులో ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. తమ కుమారుడు రాజేష్‌కు బెంగళూరులో భారీ ప్యాకేజీతో ఉద్యోగం ఇప్పిస్తాని రంజిత్ తమ వద్ద రెండు, మూడు విడతలు డబ్బులు తీసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉద్యోగం ఇప్పించకపోగా, తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వడం లేదని వాపోయారు. దీనిపై స్థానిక పోలీసుల ఆశ్రయించినా ప్రయోజనం లేకుండా పోవడంతో ఎస్పీకి విన్నవించినట్లు వెల్లడించారు.

ప్రత్యేక నైపుణ్యమే లక్ష్యం

తిరుపతి అర్బన్: ప్రత్యేక నైపుణ్యం సాధించడానికి ప్రభుత్వ ఉద్యోగులకు కోర్సులను ఏర్పాటు చేస్తున్నట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల నైపుణ్యంతో సుపరిపాలన పెంపొందించే దిశగా కోర్సులు ఉంటాయని చెప్పారు. ఐగాట్ కర్మయోగి పోర్టల్ యాప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మూడు రకాల కోర్సులను ప్రవేశపెట్టినట్టు వెల్లడించారు. జిల్లాలో డీడీఓలు అందరూ ఈ యాప్ గురించి అవగాహన చేసుకోవాలని చెప్పారు. ఈ కోర్సులను మార్చి 20వ తేదీ లోపు పూర్తి చేయాలని సూచించారు. లాగిన్ కు సంబంధించిన సమస్యలు తలెత్తితే 9652171785, 9063494729 నంబనర్లలో సంప్రదించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ ట్రైనింగ్ అధికారి వెంకటేష్ , సీపీఓ ప్రేమ్‌చంద్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఆశలు ఆవిరి!

- ద్రవిడ వర్సిటీలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతన వెతలు
- ఏడాది నుంచి జీతాలు అందక అవస్థలు
- ఫైనాన్స్ అప్రూవల్ ఇవ్వలేమని చేతులెత్తేసిన ప్రభుత్వం
- సమ్మెకు సన్నద్ధమవుతున్న ఉద్యోగులు



ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం

కుప్పం : ద్రవిడ విశ్వవిద్యాలయంలో సుమారు 15 ఏళ్ల నుంచి ఔట్‌సోర్సింగ్ విధానంలో 206 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి ఏడాది నుంచి జీతాలు రావడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కుప్పం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంపై భరోసా ఇచ్చారు. వెంటనే జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. తర్వాత ఆరునెలల వేతనాలు మాత్రం అందించారు. తర్వాత నుంచి వేతనాల ఊసే వదిలేశారు. ఇక అప్పటి నుంచి ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. కుటుంబపోషణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

భూములిచ్చినవారే అధికం

ద్రవిడ వర్సిటీ అభివృద్ధికి భూములు త్యాగం చేసిన రైతుల కుటుంబాల్లోనే పలువురికి ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగాలు ఇచ్చారు. అది కూడా అటెండర్లు, స్వీపర్లు వంటి చిరుద్యోగులుగానే పని చేస్తున్నారు. వీరు మొదట్లో 250 మందికి పైగా ఉండేవారు. ప్రస్తుతం 206 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు.

జీతాలు ఇవ్వలేం..!

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని ద్రవిడ వర్సిటీ అధికారులు ప్రభుత్వానికి విన్నవించారు. ఈ మేరకు ఫైనాన్స్ అప్రూవల్ మంజూరు చేయాలంటూ కోరారు. దీనికి సంబంధించిన ఫైళ్లను ప్రభుత్వం సోమవారం తిరస్కరించినట్లు తెలిసింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వర్సిటీనే జీతాలు చెల్లించుకోవాలని తేల్చిచెప్పినట్లు సమాచారం. రిజిస్ట్రార్ దీంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నాయకులను పిలిపించి విషయం వివరించారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయంటూ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్రవిడ వర్సిటీనే నమ్ముకుని చాలీచాలని జీతాలతో బతుకుతున్నామని, ప్రస్తుతం అది కూడా అందకపోవడంతో ఆత్మహత్యలే శరణ్యంగా మారుతోందని వాపోతున్నారు.

మోగనున్న సమ్మె సైరన్?

జీతాలు ఇవ్వలేమని ప్రభుత్వం తేల్చిచెప్పిన నేపథ్యంలో ఉద్యోగులు సమ్మెకు సైరన్ మోగించనున్నట్లు సమాచారం. ఈ మేరకు వర్సిటీలో నాన్‌టీచింగ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం సమావేశమై సమ్మెపై చర్చించనున్నట్లు తెలిసింది.

విద్యార్థుల ఆకలి కేకలు

- పది పరీక్ష కేంద్రాల బడుల్లో ఇబ్బందులు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



పాలసముద్రం సమీపంలోని వసతి గృహంలో వంట చేస్తున్న మహిళలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా పది పరీక్ష కేంద్రాలున్న ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం విద్యార్థులు ఆకలి కేకలు పెట్టాల్సి వచ్చింది. జిల్లాలోని 70 సర్కారు బడుల్లో పరీక్ష కేంద్రాలను ఎర్పాటు చేశారు. ఆయా బడుల్లో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహించాల్సి ఉంది. విద్యార్థులకు మధ్యాహ్నభోజనం పెట్టాలంటే ఉదయం నుంచి కార్మికులు బడుల్లోనే వంట చేయాల్సి వస్తుంది. అయితే పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రాల్లో పోలీసులు వంట మనుషులను లోనికి అనుమతించని పరిస్థితి ఏర్పడింది. దీంతో జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్నం పాఠశాలలకు వచ్చే విద్యార్థుల కోసం భోజనం ఎక్కడ వండాలో తెలియని దుస్థితి దాపురించింది. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో క్షేత్రస్థాయి అధికారులకు జిల్లా విద్యాశాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి. సమీపంలోని ప్రాథమిక పాఠశాల, వసతి గృహాలుంటే అక్కడ మధ్యాహ్నభోజనం తయారు చేయించాలని సూచించారు. దీంతో అప్పటికప్పుడు ప్రాథమిక పాఠశాలలు, వసతి గృహాల్లో వంట చేసుకుని ఆటోల్లో పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు వడ్డించాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే పలువురు విద్యార్థులకు ఆహారం అందక పస్తులుండాల్సి పరిస్థితి తలెత్తింది. దీంతో విద్యాశాఖ అధికారులపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భవిత భారం.. 'శిక్షణ' దూరం



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న డీఎస్సీ అభ్యర్థులు

- కలెక్టరేట్ ఎదుట డీఎస్సీ అభ్యర్థుల ధర్నా
- చిత్తూరులో కోచింగ్ సెంటర్ ఏర్పాటుకు డిమాండ్

చిత్తూరు కలెక్టరేట్ : మెగా డీఎస్సీ నిర్వహణపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని, దీంతో తమ భవిష్యత్ భారంగా మారిందని డీఎస్సీ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట డీఎస్సీ అభ్యర్థులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలమనేరుకు చెందిన మునికుమార్ మాట్లాడుతూ ప్రతి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రత్యేకంగా డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తామన్న హామీని తుంగలో తొక్కేశారని మండిపడ్డారు. రాయలసీమకు సంబంధించి అనంతపురం ఒక్కచోటే కోచింగ్ సెంటర్ పెట్టడం దారుణమన్నారు. అంత దూరం వెళ్లి శిక్షణ పొందాలంటే కష్టతరంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు చిత్తూరులోనే శిక్షణ ఇప్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయకపోవడం అన్యాయమన్నారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరికి వినతిపత్రం సమర్పించారు. ఈ క్రమంలోనే ధర్నా నిర్వహిస్తున్న డీఎస్సీ అభ్యర్థులకు సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు మద్దతు పలికారు. దూర ప్రాంతాల్లో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తే మహిళా అభ్యర్థుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కోచింగ్ కేంద్రాల ఎంపికలో అధికారులు పారదర్శక పాటించలేదని, ముడుపు ఇచ్చిన వారికే సెంటర్లు కట్టబెట్టారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చిత్తూరుకు శిక్షణ కేంద్రం మంజూరు చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

'కాసు'క్కుర్చున్న ఖాకీ!

- పోలీస్‌స్టేషన్‌లోనే యథేచ్ఛగా లావాదేవీలు
- ధనార్జనే ధ్యేయంగా విధులు
- ఆఖరుకు దొంగల నుంచి కూడా రూ.లక్షలు వసూలు
- చిత్తూరులో వివాదాస్పదంగా ఓ పోలీస్ అధికారి తీరు



చిత్తూరు అర్బన్ : పోలీస్ వృత్తి నిబద్ధతతో కూడుకుంది. శాంతిభద్రతల రక్షణతో ముడిపడింది. ప్రజలు ప్రశాంతంగా జీవనం సాగించేలా భరోసా కల్పిస్తుంది. అలాంటి ఉన్నతమైన శాఖలో పనిచేస్తున్న ఓ ఖాకీ తీరు ప్రతిష్టాత్మక వ్యవస్థ పరువును మంటగలుపుతోంది. రక్షకభటులకు ఆలయంతో సమానమైన స్టేషన్‌ను అవినీతి కార్యకలాపాలకు అడ్డాగా మార్చేయడం విమర్శలకు తావిస్తోంది. ఘనత వహించిన సదరు పోలీసు అధికారి అవినీతి చిట్టా నుంచి ఒక్కొక్కటి బయటకు రావడం జిల్లా పోలీస్‌శాఖను కుదిపేస్తోంది. ఘనత వహించిన అధికారి పద్దులో నుంచి మచ్చుకు కొన్ని..

- ఎవరైనా బంగారు ఆభరణాలు పోగొట్టుకున్నామని స్టేషన్‌కు వెళితే, లాఠీ ఎత్తుకుని మరీ తరుముకుంటున్నాడు. ×ఏయ్, ఆ కథలన్నీ నాకు చెప్పొద్దు. ఎక్కడో పోగొట్టుకుని నా స్టేషన్‌కు వస్తావా? పో బయటికి₹ అంటూ వెంటపడే ఆ అధికారి.. బెంగళూరులోని ఓ ప్రముఖ వ్యక్తి ఇంట్లో పోగొట్టుకున్న నగల ఘటనపై చిత్తూరులో కేసు నమోదు చేయడం విడ్డూరమే మరి.
- నాలుగు నెలల క్రితం చిత్తూరు నగరంలోని ఓ స్థలానికి సంబంధించిన సివిల్ గొడవల్లో కూటమి పార్టీకి చెందిన ఓ నేత, అదే పార్టీ సానుభూతిపరుడైన మరో చోటా నేత రోడ్డెక్కి శాంతి భద్రతలకు విఘాతం కలిగించారు. అప్పటికే చోటా నేత నుంచి రూ.5 లక్షలు తీసుకున్న ఆ అధికారి.. కనీసం కేసు కూడా నమోదు చేయలేదనే ఆరోపణలున్నాయి.
- ఓ ఇంట్లో తాపీ పనికివచ్చిన వ్యక్తి ఇటీవల పని చేస్తూ మిద్దెపైనుంచి పడి మృతి చెందాడు. వాస్తవానికి ఈ ఘటనపై ఇంటి యజమానిని పిలిపించి..ఆ మరణానికి నువ్వే కారణం, నీపై కేసు నమోదుస్తున్నా.. అని చెప్పి, తర్వాత 195 సెక్షన్ కింద కేసు మార్చేశారని స్టేషన్ సిబ్బందే బహిరంగంగా చెప్పుకుంటున్నారు. దీనికి ప్రతిఫలంగా రూ.3 లక్షలు ఇంటి యజమాని నుంచి ఆ ఖాకీ నొక్కేసినట్లు చెబుతున్నారు.
- ఫిబ్రవరి ఓరోజు రాత్రి తప్పతాగిన సంపన్న కుటుంబానికి చెందిన ఓ యువకుడు కారు నడుపుతూ, వేరే కారులో ముందు వెళుతున్నవాళ్లను భయభ్రాంతులకు గురిచేశాడు. నడిరోడ్డుపై అవతలివాళ్ల కారు అడ్డగించి, అందర్నీ కిందకు దించి కారును తనిఖీ చేశాడు. ప్రాణభయంతో స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు ఇస్తే డ్రంక్ డ్రైవ్ కింద ఫైన్ కట్టించి నిందితుడిని వదిలేశాడు. ప్రతిఫలంగా ఆ సంపన్న యువకుడి నుంచి రూ.1.50 లక్షల లంచం తీసుకున్నాడనే ఆరోపణలూ గుప్పుమన్నాయి.
- ఇక పలువురు మద్యం దుకాణాల యజమానులను స్టేషన్‌కు పిలిపించి నెలసరి మామూళ్లు డిమాండ్ చేయడం ఆయనకే చెల్లు. అక్రమంగా ఇసుక తరలింపు, పర్మిట్‌లేని గ్రానైట్ లారీలు, క్రికెట్ బెట్టింగులు నిర్వహించే వారి నుంచి నెలసరి భారీ మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నట్టు స్టేషన్ మొత్తం కోడై కూస్తోంది.
- ఇటీవల రాయచోటిలో పట్టుబడ్డ ఓ దొంగ.. ×సార్, చిత్తూరులోని ఓ పోలీస్ అధికారికి రూ.12.5లక్షలు లంచంగా ఇచ్చా. మీకు ఎంత కావాలి..?₹ అంటూ సవాల్ విసిరాడు. చోరీ కేసులో దొంగతో చేతులుకలిపిన సదరు ఖాకీ, భారీగా సొమ్ములు బొక్కేసినట్లు చెప్పుకుంటున్నారు. స్టేషన్‌లో పనిచేసే ముగ్గురు కానిస్టేబుళ్లు జరిగింది వాస్తవమంటూ ఓ అధికారి ఎదుట అంగీకరించడంతో.. వారిపై బెదిరింపులకు దిగినట్లు విమర్శలున్నాయి.
- ఇన్ని ఆరోపణలున్నా.. ఆ అధికారి చెప్పే ఫైనల్ మాట... ×బాసు₹ నన్ను డైరెక్ట్‌గా తెచ్చుకున్నాడు. ఆయన వద్దకు వెళితే నాకిచ్చే మర్యాదే వేరు. ఈ మధ్య ఉన్నతాధికారి చేసిన ఓ పనికిమాలిన పనికి బాస్ ఫైర్ అయ్యాడు. నేనువెళ్లి నచ్చచెప్పాకా వదిలేశాడు. లేదంటే ఆ అధికారి అవుట్.. ఎవ్వడూ నన్నేం చేయలేడు..₹₹ అని చెప్పడం ఆయనకే చెల్లు.

గంజాయి విక్రేతల అరెస్ట్

చిత్తూరు అర్బన్: నగరంలో గంజాయి విక్రయిస్తున్న ఏడుగురిని సోమవారం వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ నెట్టికంఠయ్య వివరాల మేరకు .. చిత్తూరు నగరం ఇరువారం ముస్లింకాలనీలో ఆదివారం గంజాయి పట్టుబడింది. దీనిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో వళ్లెమ్మ, షేక్ అల్లాబకాష్, సెల్వం, లోకేష్, ఆర్.సురేష్, ధనుష్‌కుమార్, రాజేష్, సూర్యపై కేసు నమోదు చేశారు. వీరి నుంచి రూ.33వేల విలువైన 2.370కేజీల గంజాయిని స్వాధీనం చేసుసుకున్నారు. అలాగే రూ. 4.43 లక్షలు విలువ చేసే కారు, ద్విచక్రవాహనాలను కూడా సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుల్లో వళ్లెమ్మ పరారీలో ఉన్నట్లు వివరించారు.

సెల్‌ఫోన్ రిపేర్, సర్వీసింగ్‌లపై ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో ఈనెల 25 నుంచి 30 రోజుల పాటు పురుషులకు సెల్‌ఫోన్ రిపేరు, సర్వీసింగ్‌లపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ పి. సురేష్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 ఏళ్లలోపు ఉన్న పురుషులు అర్హులన్నారు. కనీసం విద్యార్హత 10వ తరగతి అని, శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచిత భోజన వసతి కల్పిస్తామని, రానూ పోనూ ఒక్కసారి చార్జీలు ఇస్తామన్నారు. అలాగే శిక్షణానంతరం ధ్రువ పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్, రేషన్ కార్డు జెరాక్స్‌లు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని, తొలుత పేర్లు నమోదు చేసుకున్న ప్రాధాన్యత ఇస్తామన్నారు. మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11-48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట , చంద్రగిరి. ఫోన్: 79896 80587, 94949 51289, 63017 17672 సంప్రదించాలని సూచించారు.

బెల్లం ఊట ధ్వంసం



దాడుల్లో పాల్గొన్న ఎక్సైజ్, పోలీసు సిబ్బంది

పాలసముద్రం : మండలంలోని నరసింహపురంలో సారా బట్టీలపై కార్వేటినగరం ఎక్సైజ్ సీఐ శిరీషాదేవి, పాలసముద్రం ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తమ సిబ్బందితో కలసి సోమవారం దాడులు చేశారు. సుమారు వెయ్యిలీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. సీఐ మాట్లాడుతూ సారా తయారు చేసినా, విక్రయించినా కేసులు తప్పవని హెచ్చరించారు.

కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు 279 వినతులు

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ మేరకు ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి అర్జీలు స్వీకరించారు. డీఆర్ఓ మోహన్‌కుమార్, ఆర్‌డీఓ శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు పాల్గొన్నారు. ఈ క్రమంలో కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు వివిధ సమస్యలపై మొత్తం 279 వినతులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

సూర్యతేజం.. స్వర్ణశోభితం



నగరిలోని కరియమాణిక్యస్వామి ఆలయగోపురం స్వర్ణకాంతులీనుతూ భక్తులను పులకింపజేసింది. సోమవారం పడమటి సంధ్యాసమయంలో సూర్యకిరణాలు సోకడంతో అపూర్వ దృశ్యం ఆవిష్కృతమైంది. ప్రకృతి ప్రసాదించిన అద్భుతాన్ని వీక్షించేందుకు ప్రజానీకం తరలివచ్చింది. ఈ క్రమంలోనే ఆకాశంలో చంద్రుడు ప్రత్యక్షం కావడం ప్రత్యేకతను సంతరించుకుంది.

– నగరి

కోర్సుల్లో కోత..
విద్యార్థులకు వాత!

- 30 శాతం కంటే తక్కువ విద్యార్థులు ఉన్న కోర్సులపై ఆరా
- నివేదిక ఇవ్వాలంటూ విభాగాధిపతులకు ఆదేశాలు
- 2025-26 విద్యాసంవత్సరంలో పలు కోర్సులకు కత్తెర పడే అవకాశం
- ఎస్వీయూలో ఇదీ పరిస్థితి



ఎస్వీయూ ప్రధాన ద్వారం

తిరుపతి సిటీ: రాయలసీమకే తలమానికంగా నిలిచిన శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పలు కోర్సులకు కత్తెర వేసే దిశగా అడుగులు వేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే సాకుతో కోర్సుల్లో కోత విధించేందుకు అధికారులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. ఎస్వీయూలో ప్రస్తుతం 56 విభాగాలలో 3 వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో విద్యార్థుల సంఖ్య 30 శాతం కంటే తక్కువగా సుమారు 10 కోర్సులు ఉన్నట్లు తెలుస్తోంది. తక్కువగా ఉన్న కోర్సులను ఇతర కోర్సుల్లోకి మెర్జ్ చేయడం లేదా తొలగించాలనే ప్రయత్నంలో వర్సిటీ అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. తక్కువ ప్రవేశాలు ఉన్న కోర్సుల వివరాలతో కూడిన జాబితాను తయారు చేసి సమర్పించాలని అధికారులకు లిఖిత పూర్వకంగా ఆదేశాలు అందాయి.

సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులకు మంగళం

2025-26 ఏపీ పీజీసెట్‌లో గత 50 ఏళ్లుగా వర్సిటీలో కొనసాగుతున్న పలు కోర్సులు కనబడకపోవచ్చని అంచనా. ప్రధానంగా సైన్స్, ఆర్ట్స్, ఇంజినీరింగ్ విభాగాలలో సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులను తొలగించే అవకాశముంది. అలాగే రెగ్యులర్ కోర్సులలో కొన్నింటిని మెర్జ్ చేయవచ్చని సమాచారం.

ప్రవేశాలను పెంచడం చేతగాకే...



ప్రవేశాలను పెంచుకోవడం చేతగాకనే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్, తమిళ్, ఉమెన్ స్టడీస్ వంటి కోర్సులకు చరమగీతం పాడుతూ మరిన్ని కోర్సులను మెర్జ్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే జరిగితే విద్యార్థి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏడీ బిల్డింగ్‌ను ముట్టడిస్తాం. – ఎస్.చిన్న, ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి, తిరుపతి

స్వతహాగా పీజీసెట్ బెటర్



వర్సిటీ అభివృద్ధి పథంలో నడవాలంటే కోర్సులను తొలగించడం కాదు. ప్రవేశాలను ప్రోత్సహించి, స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇవ్వాలి. ఉపాధి, ఉద్యోగావకాశాలను పెంచే ప్రయత్నం జరగాలి. కామన్ పీజీ సెట్‌ను రద్దు చేసి, వర్సిటీ స్వతహాగా పీజీసెట్ నిర్వహిస్తే అడ్మిషన్లు పెరుగుతాయి. – భగవత్ రవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, తిరుపతి

ఉద్యమిస్తాం



అధికారుల నిర్లక్ష్య వైఖరితోనే విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ప్రవేశాలను పెంచుకునేందుకు ప్రయత్నం చేయాలి తప్ప, కోర్సులను తొలగించడం సరికాదు. ఇదే జరిగితే ఉద్యమిస్తాం. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందని ద్రాక్షగా చేసి కార్పొరేటీకరణ దిశగా అడుగులు వేస్తే సహించేది లేదు. – బండి చలపతి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు, తిరుపతి

హేయమైన నిర్ణయం



పేరొందిన వర్సిటీలో అడ్మిషన్లు తక్కువగా ఉన్నాయన్న కారణంగా కోర్సుల్లో కోత హేయమైన నిర్ణయం. ఇలాంటి ప్రయత్నాలను అధికారులు విరమించుకోవాలి. లేనిపక్షంలో విద్యార్థుల ఆగ్రహానికి గురికాక తప్పదు. – శివశంకర్‌నాయక్, జీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, తిరుపతి

వర్సిటీకి చెడ్డపేరు



అధికారులు విద్యను ప్రోత్సహించాలే తప్ప కోర్సులను తొలగించడం దారుణం. వర్సిటీలో ఏ కోర్సును తొలగించినా ధర్నాలు, నిరసనలు తప్పవు. ఇలాంటి దుశ్చర్యలతో వర్సిటీకి చెడ్డపేరు తేవడం దారుణం. – మల్లికార్జున, ఎన్ఎస్‌యూఐ, రాష్ట్ర కార్యదర్శి, తిరుపతి